ఆదివారం ప్రత్యేకం
Sunday special

జీవ వైవిధ్యానికి నెలవైన నల్లమలలోకి ఏనుగులు రాబోతున్నాయి. కర్నాటక నుంచి శిక్షణ పొందిన 9 ఏనుగులను (కుంకీలను) రప్పించేందుకు మన అటవీ శాఖ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ ప్రయత్నాలు సవ్యంగా జరిగితే త్వరలోనే కుంకీ ఏనుగులు నల్లమలకు వస్తాయి.



నల్లమలలోకి గజరాజు

- అటవీ, వన్యప్రాణుల రక్షణలో కుంకీలు
- 9 శిక్షణ ఏనుగులు ఇవ్వాలని కర్నాటక అటవీశాఖను కోరిన ఏపీ ప్రభుత్వం
- కొద్దినెలల్లోనే నల్లమలకు ఏనుగుల రాక
- త్వరలోనే మైసూర్‌లో కుంకీల శిక్షణకై వెళ్లనున్న ఎన్ఎస్‌టీఆర్ సిబ్బంది

మంచి నిర్ణయం



నల్లమలకు కుంకీ ఏనుగులను రప్పించాలని అటవీశాఖ ఉన్నతాధికారులు అనుకోవడం చాలా మంచి నిర్ణయం. ఇప్పటికే నల్లమలలో ఎప్పుడో అంతరించిపోయిన అడవిదున్నలు తిరిగి కనిపించడం కొంత ఆనందించదగ్గ విషయమే. అయితే నల్లమలలో సంపూర్ణమైన జీవవైవిధ్యాన్ని సాధించాలన్న క్రమంలో ఏనుగులను కూడా తీసుకురావడం బాగుంటుంది. ఏనుగులు ఎప్పటికప్పుడు గడ్డి తినడం వల్ల అడవిలో అగ్నిప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది.

- వీ.సాయిబాబా, ప్రాజెక్ట్ టైగర్, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు

ఆత్మకూరు, జూలై 13: దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్‌గా పేరుగాంచిన నాగార్జునసాగర్ - శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం (ఎన్ఎస్‌టీఆర్)లో ఎన్నో రకాల జంతువులు ఉన్నప్పటికీ ఏనుగులు లేవు. నల్లమలలో విశాలమైన పచ్చిక మైదానాలు లేకపోవడం, చెరువులు, కుంటలు తదితర నీటివనరులు పుష్కలంగా లేకపోవడం దీనికి కారణమని చెబుతున్నారు. సాధారణంగా మహావృక్షాలతో కూడిన అటవీ ప్రాంతాల్లో ఏనుగుల సంచారం అధికంగా ఉంటుంది. అయితే నల్లమలలో దట్టమైన వెదురు పొదలు మాత్రమే ఉంటాయి. వీటిలో ఏనుగులు ఆవాసాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపవు.

ఇకపై నల్లమల రక్షణకు కుంకీలు

నల్లమలలో పూర్తి జీవవైవిధ్యాన్ని తీసుకొచ్చేందుకు అన్నిరకాల జంతువులను రప్పించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే నల్లమలలో అంతరించిపోయిన అడవిదున్నలను తిరిగి నల్లమలకు తీసుకొచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుండగా తాజాగా కుంకీలను (శిక్షణ పొందిన ఏనుగులు) నల్లమలకు తీసుకురావాలని అటవీశాఖ ప్రయత్నిస్తోంది. ఏనుగులకు మిగతా అన్ని జంతువుల కన్నా ఎంతో తెలివితేటలు ఉంటాయి. వీటి తెలివితేటలను ఇప్పటికే కర్నాటక, కేరళ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో అటవీ, వన్యప్రాణుల రక్షణకై ఉపయోగించుకుంటున్నారు. అటవీ ప్రాంతాల్లోని ఏనుగులు గ్రామాల వైపు రాకుండా వాటిని దారి మళ్లించేందుకు కుంకీలను వినియోగిస్తారు. కుంకీలు వన్యప్రాణులకు, మనుషులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తాయి. వీటిద్వారా నల్లమలలో కలప అక్రమ రవాణా, వన్యప్రాణుల వేటకు అడ్డుకట్ట వేయడంతో పాటు ఏదైనా సందర్భంలో పెద్దపులి, చిరుత వంటి వన్యప్రాణులు గాయపడినప్పుడు లేదా ఆరోగ్యం క్షీణించినప్పుడు మారుమూల ప్రదేశానికి సైతం కుంకీల ద్వారా అక్కడి పరిసరాలకు చేరుకుని పరిస్థితిని పరిశీలించేందుకు అవకాశం వుంటుంది. తద్వారా గాయపడిన వన్యప్రాణికి చికిత్సలు అందించవచ్చు. ఇప్పటికే అటవీ, వన్యప్రాణుల రక్షణలో అనేక మంది అటవీశాఖ సిబ్బందితో వివిధ బృందాలు పనిచేస్తున్నారు. ప్రత్యేకించి స్ట్రైకింగ్ ఫోర్స్, యాంటిపోచింగ్ ఫోర్స్, స్క్వాడ్ టీం, బేస్ క్యాంపుల వద్ద ప్రొటెక్షన్ వాచర్స్ తదితర విభాగాలతో నిఘా ఉంచుతున్నారు. అలాగే కెమెరా ట్రాప్స్, డ్రోన్ కెమెరాలు, ఇతర అత్యాధునిక పరికరాలను అటవీరక్షణకు ఉపయోగిస్తున్నారు. వీటితో పాటు కుంకీలను కూడా అటవీ, వన్యప్రాణుల రక్షణకు వినియోగించి ప్రతిరోజు నిర్దేశించిన అటవీ ప్రదేశంలో శిక్షకుడి పర్యవేక్షణలో ఏనుగులతో గస్తీ (పెట్రోలింగ్) చేపడితే మంచి ఫలితాలు ఉంటాయని అటవీశాఖ భావిస్తోంది.



ఏనుగులతో నల్లమలకు ప్రయోజనం

నల్లమలలో అనేకమైన గడ్డితినే జంతుజాతులు (హెరివోర్స్) ఉన్నాయి. అయితే చాలావరకు ఏనుగులు, అడవిదున్నలతో పోల్చితే వాటి పరిమాణం చాలా తక్కువ. నల్లమలలోని వివిధ రకాల గడ్డిజాతులు, వెదురు ఆకులు, వెలగ, రాగి, మర్రి, జివ్వి చెట్లు ఉన్నందు వల్ల ఏనుగులకు ఆహార కొరత ఉండదు.

ఖర్చుతో కూడిన వ్యవహారమే

కుంకీ ఏనుగులను నల్లమల రక్షణకై తీసుకురావడం కొంత ఖర్చుతో కూడిన వ్యవహారమే. వాటి కోసం ప్రత్యేకమైన శిబిరాన్ని ఏర్పాటు చేసి పర్యవేక్షించాల్సి ఉంటుంది. అలాగే ప్రతి ఏనుగుకు సుమారు ఇద్దరు చొప్పున శిక్షకులను నియమించాలి. వీటన్నింటి కోసం అటవీశాఖ ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. అయినప్పటికీ నల్లమలకు ఏనుగులను తీసుకురావాలన్న బలమైన సంకల్పంతోనే అధికారులు ఈ ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే చిత్తూరు జిల్లాలోని కౌండిన్య అడవుల్లో జయంత్, వినాయక అనే రెండు కుంకీ ఏనుగులు ఉన్నాయి. ఆడ ఏనుగులు గుంపులుగా సంచరిస్తే మగ ఏనుగులు ఒంటరిగా తిరుగుతాయి. అందుకే కుంకీ ఏనుగులకు ఎక్కువగా మగ ఏనుగులనే ఎంచుకుంటారు.



త్వరలోనే మైసూర్‌లో కుంకీల శిక్షణకై వెళ్లనున్న ఎన్ఎస్‌టీఆర్ సిబ్బంది



ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల రిజర్వు ఫారెస్ట్ ప్రాంతానికి 9 శిక్షణ ఏనుగులు ఇవ్వాలని కర్నాటక రాష్ట్ర అటవీశాఖను ఏపీ ప్రభుత్వం కోరింది. ఇందుకు కర్నాటక అటవీశాఖ ఆమోదం తెలపడంతో త్వరలోనే మైసూరులో కుంకీల శిక్షణకై నల్లమల పరిధిలో పనిచేస్తున్న అటవీ సిబ్బంది వెళ్లనున్నట్లు తెలిసింది. వారు అక్కడ కుంకీల శిక్షణలో నిష్ణాతులైన తర్వాత వాటిని నల్లమలకు తీసుకొచ్చి అటవీ, వన్యప్రాణుల రక్షణకు వినియోగించనున్నట్లు సమాచారం. ఈ ప్రక్రియ అంతా సవ్యంగా జరగేందుకు మరో కొన్ని నెలల సమయం పట్టవచ్చునని తెలిసింది.

పెండింగ్ ప్రాజెక్టులపై ప్రతిపాదనలు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), జూలై 13: జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను ప్రపంచ బ్యాంక్ నిధులతో పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు ప్రభుత్వం సిద్ధం చేస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ ఉచిత ఇసుక హామీని చంద్రబాబు ప్రారంభించిన వెంటనే నిర్మాణ రంగంలో పనులు వేగవంతం అయ్యాయన్నారు. అలాగే ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టేందుకు పేద, మధ్య తరగతి ప్రజలు ముందుకు వస్తున్నారన్నారు. సామాజిక పింఛన్ల పెంపు, డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నెలరోజుల్లోనే ఇచ్చిన హామీలను చంద్రబాబు నిలబెట్టుకున్నారన్నారు. ఈ సందర్భంగా తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం పలు సమస్యలు, గత ప్రభుత్వ వేధింపులపై పోస్టర్‌ను తయారు చేసింది. ఆ పోస్టర్‌ను టీడీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, తెలుగునాడు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేషఫణి రాజు, జిల్లా అధ్యక్షుడు ఎం.బజారన్న, బి.సుబాన్ సింగ్, టీడీపీ నాయకులు నంద్యాల నాగేంద్ర, తిరుపాల్ బాబు, బాబురాజ్, కేవీసుబ్బారెడ్డి, సత్రం రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కర్నూలు ఎస్పీగా గరికపాటి బిందు మాధవ్

నెల్లూరుకు కృష్ణకాంత్ బదిలీ



గరికపాటి బిందు మాధవ్

కర్నూలు, జూలై 13: కర్నూలు జిల్లా ఎస్పీగా గరికపాటి బిందుమాధవ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐపీఎస్ బదిలీల్లో భాగంగా కర్నూలు ఎస్పీగా ఈయనను నియమించింది. ప్రస్తుతం కర్నూలు ఎస్పీగా ఉన్న జి.కృష్ణకాంత్‌ను నెల్లూరు ఎస్పీగా బదిలీ చేసింది. కృష్ణకాంత్ గత ఏడాది ఏప్రిల్ నెలలో కర్నూలు ఎస్పీగా నియమితులయ్యారు. ఆ తర్వాత అవినాశ్ రెడ్డి అరెస్టులో సీబీఐకి సపోర్టు చేయకుండా కొంత మెతక వైఖరి తీసుకున్నారు. ఆయనను అరెస్టు చేస్తే లా అండ్ ఆర్డర్ సమస్యలు వస్తాయనీ వెనక్కు తగ్గారు. ఆ తర్వాత జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు దొంగతనాలు అరికట్టడంలో పలు సందర్భాల్లో ఆయన తన మార్క్‌ను చూపించుకోలేకపోయారు. ఎన్నికల అనంతరం పత్తికొండ నియోజకవర్గంలో జరిగిన వైసీపీ దాడులను అరికట్టడంలో విఫలమయ్యారు.



కృష్ణకాంత్

కొత్త ఎస్పీ గురించి

కర్నూలు జిల్లా ఎస్పీగా నియమితులైన గరికపాటి బిందుమాధవ్ స్వస్థలం విజయవాడ. 2017బ్యాచ్‌కు చెందిన వారు. బీటెక్ మధ్యలోనే డిస్‌కంటిన్యూ చేసి ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తి చేసి గురువుల ప్రోత్సాహంతో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ప్రకాశం జిల్లాలో ట్రైనీ ఎస్పీగా పని చేశారు. అలాగే గుంటూరు సెబ్ ఏఎస్పీగా పని చేశారు. ఆ తర్వాత 2019-20 మధ్యలో గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా, తర్వాత రంపచోడవరం ఏఎస్పీగా పని చేశారు. ఆ తర్వాత గ్రేహౌండ్స్ ఎస్పీగా నియమితులయ్యారు. అక్కడ నుంచి ఎన్నికల కమిషన్ పల్నాడు జిల్లా ఎస్పీగా నియమించింది. అక్కడ 40 రోజుల పాటు ఎస్పీగా పని చేసిన ఆయన ఆ జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ఆయన సస్పెన్షన్ ఎత్తివేసింది. ప్రస్తుతం ఆయన్ను కర్నూలు ఎస్పీగా నియమించి ఉత్తర్వులు జారీ చేసింది.

నంద్యాల జిల్లా అధిరాజ్‌సింగ్ రాణా



అధిరాజ్‌సింగ్ రాణా

నంద్యాల క్రైం, జూలై 13: నంద్యాల జిల్లా ఎస్పీగా అధిరాజ్‌సింగ్ రాణాను నియమిస్తూ డీజీపీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్న అధిరాజ్‌సింగ్ రాణాను నంద్యాలకు బదిలీ చేశారు. నంద్యాల నూతన జిల్లాగా ఆవిర్భవించినప్పటినుంచి ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న కె.రఘువీర్‌రెడ్డిని డీజీపీ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఉన్నతాధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇంతవరకు నంద్యాల ఎస్పీగా పనిచేసిన కె.రఘువీర్‌రెడ్డి మరో నాలుగు నెలల్లో రిటైర్మెంట్ కానున్నారు. రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న వారిని దాదాపు బదిలీ చేయరు. కానీ ఎస్పీ రఘువీర్‌రెడ్డి గతంలో ప్రస్తుత ముఖ్యమంత్రి, అప్పటి ప్రతిపక్ష నేత అయిన నారా చంద్రబాబునాయుడును నంద్యాలలో అరెస్ట్ చేసిన సమయంలో కీలకంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలోనే రఘువీర్‌రెడ్డిపై బదిలీ వేటు పడినట్లు తెలిసింది. ఈయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. చంద్రబాబునాయుడు అరెస్ట్ ఉదంతంలో కీలకంగా వ్యవహరించారని టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రఘువీర్‌రెడ్డిపై బదిలీ వేటు పడుతుందని అందరూ భావించారు. రఘువీర్ రెడ్డి రిటైర్మెంట్ వరకూ ఇక్కడే ఉండాలని తీవ్రంగా ప్రయత్నాలు చేసినప్పటికీ ఆయన బదిలీ అనివార్యం కావడం విశేషం.



కె.రఘువీర్‌రెడ్డి

చిరుతను బంధిస్తాం

మహానంది, జూలై 13: మహానంది పరిసరాల్లోని ప్రజలను గత నెల రోజుల నుండి భయాందోళనకు గురి చేస్తున్న చిరుతపులిని బంధించేందుకు అటవీశాఖ రాష్ట్ర పీసీసీఎఫ్, వైల్డ్ లైఫ్ వార్డెన్ అజయ్‌కుమార్ నాయక్ సుముఖత వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఆలయ పరిసరాల్లోని గోశాల వద్ద చిరుతపులి సంచరించిన ప్రదేశాలను ఆలయ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్‌మీనా, ఆలయ ఏఈఓ వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్‌తో ఆయన చిరుతపులి కదలికలపై చర్చించారు. చిరుతపులి సంచారం వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకొన్నారు. దీనివల్ల ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వస్తున్నదని అధికారులు ఆయన దృష్టికి తెచ్చారు. దీనికి అజయ్‌కుమార్ నాయక్ స్పందిస్తూ.. మరి కొద్ది రోజులు మహానంది పరిసరాల్లోని ప్రజలు జాగ్రత్తగా ఉండేలా చూడాలని, చిరుతపులిని బంధించేందుకు బోన్లు ఏర్పాటు చేయడానికి తాను సముఖంగా ఉన్నానని అన్నారు.

తుంగభద్ర డ్యాంకు 30.69 టీఎంసీలు

- 18,060 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఎల్లెల్సీ సాగునీరు ఇవ్వాలని రైతుల డిమాండ్

కర్నూలు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి గత ఏడాదితో పోలిస్తే ఆశాజనకంగా వరద చేరుతోంది. శనివారం వరద చేరిక లెక్కలు తీసే సమయానికి డ్యాంలో 30.69 టీఎంసీలు వరద చేరినట్లు టీబీపీ బోర్డు ఇంజనీర్లు తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి 1585.22 అడుగుల వద్ద 7.47 టీఎంసీలు నిల్వ ఉండేది. 7,069 క్యూసెక్కులు వరద డ్యాంలో చేరేది. ప్రస్తుతం గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలుగా కాగా.. శనివారం 1606.21 అడుగుల వద్ద 30.69 టీఎంసీలు వరద చేరింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు 18,060 క్యూసెక్కుల వరద జలాశయంలో చేరుతోంది. ఐదారు రోజులతో పోలిస్తే వరద స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. డ్యాంలో 25 టీఎంసీలు వరద చేరి ఇన్‌ఫ్లో ఆశాజనంగా ఉంటే జూలై 15 నుంచి ఎల్లెల్సీ సహా వివిధ కాలువలకు సాగునీరు విడుదల చేస్తామని గత నెలలో జరిగిన టీబీపీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే ప్రస్తుతం 30.69 టీఎంసీలు చేరడంతో ఐఏబీ సమావేశంతో నిమిత్తం లేకుండా సాగునీరు ఇవ్వాలని ఎల్లెల్సీ ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

టీబీపీ బోర్డు ఎస్ఈతో మాట్లాడిన ఎమ్మెల్యే బీవీ

తుంగభద్ర జలాశయంలో చేరుతున్న వరద, ఎల్లెల్సీ కాలువకు సాగునీటి విడుదలపై ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి టీబీపీ బోర్డు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డితో మాట్లాడారు. ఎల్లెల్సీ కింద ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్‌లో 43,519 ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉందని, ప్రస్తుతం జిల్లాలో వర్షాలు ఆశాజనంగా లేకపోవడంతో ఎల్లెల్సీకి తక్షణమే సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే బీవీ కోరారు. టీబీ డ్యాం నుంచి ఎల్లెల్సీ కాలువకు నీటిని విడుదల చేసేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని, కర్నూలు ఇరిగేషన్ అధికారులు ఇండెంట్ ఇవ్వాలని బోర్డు ఎస్ఈ ఎమ్మెల్యే బీవీకి సూచించారు. రైతులను దృష్టిలో ఉంచుకొని ఐఏబీ సమావేశంతో సంబంధం లేకుండా తక్షణమే ఎల్లెల్సీకి సాగునీరు ఇవ్వాలని బీవీ కోరారు. నీటి విడుదలపై జిల్లా కలెక్టరు పి.రంజిత్‌బాషాతో మాట్లాడుతానని ఎమ్మెల్యే అన్నారు.



తుంగభద్ర డ్యాంలో చేరిన వరద నీరు

ఎటూ తేలని వాసంతి కేసు

- ఉదయం నుంచి పర్యవేక్షిస్తున్న డీఐజీ విజయరావు
- నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్‌లో విచారణ?
- డీలాపడిపోయిన బాలిక తల్లిదండ్రులు



ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం అప్రోచ్ కాలువ వద్ద ఎదురు చూస్తున్న గ్రామస్తులు

నందికొట్కూరు, జూలై 13: వాసంతి మిస్సింగ్ కేసు ఎటూ తేలడం లేదు. ఈ కేసులో నిందితులైన ముగ్గురు మైనర్లు చెప్పిన చోటల్లా పోలీసులు శుక్రవారం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. ఏపీ.ఎస్.డి.ఆర్.ఎఫ్, ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాలు మిస్సింగ్ అయిన బాలిక కోసం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం అప్రోచ్ కాలువలో సీసీ కెమెరాలతో తనిఖీలు నిర్వహించారు. కానీ ఆచూకీ లభించలేదు. శుక్రవారం తిరిగి కొత్తముచ్చుమర్రి గ్రామంలోని శ్మశానవాటికలోను, కేసీ కాలువకు ఆవలి వైపున ఉన్న పోరంబోకులో పాతిపెట్టామని చెప్పడంతో డీఐజీ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. కానీ ఎక్కడా ఆనవాళ్లు కనిపించలేదు. దీంతో చిన్నారుల తల్లిదండ్రులపై అనుమానం రావడంతో గత రెండు రోజుల క్రితం పిల్లల తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకొని విచారణ మొదలు పెట్టారు. వారు కూడా పిల్లలు చెప్పినట్లుగానే విచారణలో సమాధానం చెబుతున్నట్లు తెలుస్తోంది. శనివారం నియోజకవర్గంలోని ఓ పోలీసుస్టేషన్‌లో వారిని విచారించినట్లు తెలుస్తోంది. దీంతో ఓ బాలుడి తండ్రి చిన్నారిని చంపి ముచ్చుమర్రి సమీపంలో కృష్ణానదిలో పడేశానని చెప్పడంతో పోలీసుల బృందం కొత్తపల్లి మండలం సంగమేశ్వరం వద్దకు తీసుకెళ్లి అక్కడ సంగమేశ్వరం, సిద్ధేశ్వరం, అర్లపాడు తదితర పరిసర ప్రాంతాల్లో నదిలో తనిఖీ చేసినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని ఇక్కడే పడేశామని బాలురు చెప్పడంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు నీటిలోకి దిగి పరిశీలించినా కూడా వాసంతి ఆచూకీ కనిపించలేదు. అయితే డీఐజీ విజయరావు కూడా కృష్ణానదిలోకి వెళ్లి మరోసారి నదిలో పరిశీలించినట్లు తెలుస్తోంది. నిందితులైన పిల్లల నుంచి వచ్చిన సమాధానమే వారి తల్లిదండ్రుల నుంచి కూడా వస్తున్నట్లు తెలుస్తోంది.

ఎంతో ఆశగా...: శనివారం వాసంతి ఆచూకీ లభిస్తుందని పోలీసులు చెప్పిన మాట మీద కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఎంతో ఆశ పెట్టుకున్నారు. పోలీసులు కృష్ణానదిలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జల్లెడ పట్టారు. అయినా ఫలితం లేకపోవడంతో వాసంతి కుటుంబ సభ్యులు డీలాపడిపోయారు. వాసంతి మృతదేహం కృష్ణానదిలో లభించిందన్న సమాచారం గ్రామంలో పాకి పాతముచ్చుమర్రి బస్టాండులో, ముచ్చుమర్రి ఎత్తిపోతల అప్రోచ్ కాలువ మీదికి పెద్ద ఎత్తున జనం చేరుకున్నారు. కానీ మృతదేహం రాకపోవడంతో చీకటిపడ్డాక నిరాశతో తిరుగుముఖం పట్టారు.

పార్కులో డీఎస్పీ విచారణ: ముచ్చుమర్రిలోని పార్కులో ఆడుకుంటూ బాలిక అదృశ్యమైన ఘటనపై పార్కు వాచ్‌మెన్ కుమారుడిని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు విచారించారు.

ముచ్చుమర్రి శ్మశానం, కేసీ కాలువ వెంట గాలింపు

పగిడ్యాల, జూలై 13: ముచ్చుమర్రి గ్రామానికి చెందిన వాసంతి అనే బాలిక అదృశ్యం విషయంలో శనివారం పోలీసులు మైనరు బాలురను గ్రామానికి తీసుకొని వచ్చి విచారించారు. ఈ మేరకు గ్రామంలోని కేసీ కాలువ వెంట, శ్మశానంలో, ఎత్తిపోతల వద్ద సీఐలు, ఎస్‌ఐలు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం పోలీసులు కృష్ణానదిలో గాలింపు చర్యలు చేపట్టారు.



వాసంతి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరూపాక్షి

పరామర్శించిన ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

వాసంతి కుటుంబ సభ్యులను శనివారం ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి పరామర్శించారు. బాలిక కుటుంబానికి రూ. 10లక్షల ఆర్థిక సాయం అందజేయడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ముచ్చుమర్రిలో వాసంతి మృతదేహం కోసం ఎదురు చూస్తున్న గ్రామస్థులు



ముచ్చుమర్రి పార్కులో వివరాలను సేకరిస్తున్న ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు

భార్యను కాపాడబోయి.. భర్త మృతి

- రైలు నుంచి కిందపడిన వైనం
- భార్యకు తీవ్రగాయాలు

డోన్(రూరల్), జూలై 13: భార్యను కాపాడబోయి ప్రమాదవశాత్తు భర్త మృతి చెందిన సంఘటన శనివారం డోన్ పట్టణంలో చోటు చేసుకుంది. డోన్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఉడిపి జిల్లా కుందాపురం ప్రాంతానికి చెందిన భార్యాభర్తలు గంగోలి అప్రాభాను, సయ్యాద్ ఆసీఫ్ గుంటూరు నుంచి బెంగుళూరు వెళ్తున్నారు. విశాఖపట్నం నుంచి బెంగుళూరు వెళ్తున్న ప్రశాంత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లో భార్యాభర్తలు ప్రయాణిస్తున్నారు. డోన్ మండలం మల్కాపురం డోన్ రైల్వేస్టేషన్ మధ్యలో రైలు వెళ్తుండగా.. భార్య అప్రాభాను డోర్ వద్ద నిలిచి ప్రమాదవశాత్తు కాలుజారి కిందకు పడిపోయింది. ఇది గమనించిన భర్త సయ్యాద్ ఆసీఫ్ (32) హడావుడిగా భార్యను రక్షించబోతు రైలు కింద పడిపోయాడు. తోటి ప్రయాణికులు చైన్ లాగారు. రైల్వేట్రాక్‌పై పడిపోయిన సయ్యాద్ ఆసీఫ్ అప్పటికే మృతి చెందాడు. భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికులు డోన్ రైల్వేపోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రశాంత్ ఎక్స్‌ప్రెస్ రైలులో తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటన కలకలం రేపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డోన్ రైల్వే పోలీసులు తెలిపారు.

జీడీపీలో కేంద్ర జలశక్తి బృందం సర్వే

పూడికతీతపై నివేదిక తయారు చేయనున్న సర్వే బృందం

గోనెగండ్ల, జూలై 13: కర్నూలు జిల్లాలో ఏకైక మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టు గాజులదిన్నె ప్రాజెక్టు(సంజీవయ్యసాగర్)లో ఎంత పూడిక చేరిందీ, నీటి సామర్థ్యం ఎంత అని గత మూడు రోజుల నుంచి కేంద్ర జలశక్తి బృందం సభ్యులు ప్రాజెక్టు నీటిలో బోటులో తిరుగుతూ సర్వేలు చేస్తున్నారు. ప్రాజెక్టు నిర్మించినప్పుడు నీటి నిలువ సామర్థ్యం ఎంత, ప్రస్తుతం నీటి నిలువ సామర్థ్యం ఎంత, 44 ఏళ్లుగా ప్రాజెక్టులో ఎంత మేర పూడిక చేరిందనే విషయాలపై బృందం సర్వే చేస్తున్నది. నీటిలో బోటు మీద తిరుగుతూ ప్రత్యేక మీటర్లతో సర్వేలు చేయడమే గాక నీరు లేని చోట డీ.జీ.పీ.ఎస్ అనే పద్ధతిలో ఇక్కడ వరకు నీటిని ఎంత మేర నిలువ చేయవచ్చు అనే విషయంలో కూడా సర్వే చేస్తున్నారు. దీనిపై సర్వే కేంద్రబృందం నివేదిక తయారు చేసి కేంద్ర జలశక్తి అధికారులుకు సమర్పించనున్నారు. మరో నాలుగైదు రోజుల పాటు ఈ సర్వేలు జరుగుతాయని వారు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం లభ్యం

ఎమ్మిగనూరు(రూరల్), జూలై 13: ఎమ్మిగనూరు మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జోన్స్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో గుర్తు తెలియని 75 ఏళ్ల కలిగిన వృద్ధుడు మృతి చెందాడు. ఆగ్రాకు చెందిన ఓ వృద్ధుడు భిక్షాటన చేస్తూ కాలేజీ సమీపంలోనే ఉంటుండేవాడని స్థానికులు తెలిపారు. అనారోగ్యం కారణంగా శనివారం ఆ వృద్ధుడు మృతి చెందాడన్నారు. వృద్ధుడి తరుపు బంధువులెవరూ తెలియకపోవడంతో రూరల్ పోలీసులు ఎర్రకోటలో అంత్యక్రియలు నిర్వహించారు.

పారిశుధ్యానికే తొలి ప్రాధాన్యం : డీపీఓ

కర్నూలు(కలెక్టరేట్), జూలై 13: గ్రామాల్లో పారిశుధ్యానికి, పరిశుభ్రతకే తొలి ప్రాధాన్య ఇస్తున్నట్లు డీపీవో నాగరాజు నాయుడు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా అధికారులకు శనివారం ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పంచాయితీ కార్యదర్శులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాలను మండల విస్తరణ అధికారులు, డివిజనల్ పంచాయితీ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని ఏఎన్ఎంలతో సమన్వయం చేసుకుని నిర్వహించాలని సూచించారు. ప్రతి నెల 2వ తేదీ నుంచి 5వ తేదీలోపు, 17 నుంచి 20వ తేదీ లోపు గ్రామాల్లోని నీటి ట్యాంకులను తప్పనిసరిగా శుభ్రం చేయించాలని ఆదేశించారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(కలెక్టరేట్), జూలై 13: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆగని వైసీపీ నాయకుల
ఇసుక దందా

- పోలీసుల సహకారంతో యథేచ్ఛగా కొనసాగుతున్న అక్రమాలు
- పది రోజుల కింద 1700 టన్నులు స్వాహా
- కేసు నమోదు చేసి గాలికొదిలేసిన పోలీసులు



కోసిగిలోని సాయిబాబా గుడి సమీపంలో నిల్వ ఉన్న వైసీపీ నాయకుడి ఇసుక డంప్



కోసిగిలో ఓ ఇంటి నిర్మాణం ముందు జగనన్న కాలనీకి చెందిన ఇసుక

కోసిగి, జూలై 13: అధికారం మారినా కూడా వైసీపీ నాయకుల అక్రమాలు మాత్రం ఆగడం లేదు. ఐదేళ్ల పాటు అధికారాన్ని అడ్డంగా పెట్టుకుని అక్రమాలకు పాల్పడిన వైసీపీ నేతలు.. గత ప్రభుత్వంలో పని చేసిన పోలీసుల సహకారంతో ఇంకా రెచ్చిపోతూనే ఉన్నారు. కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో సాయిబాబా ఆలయం సమీపంలో ఓ వైసీపీ నాయకుడు సుమారు వంద ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను నిల్వగా చేసుకున్నా పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని టీడీపీ నాయకులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక ట్రాక్టరు ఇసుక కావాలంటే రూ.3వేలు వైసీపీ నాయకులు ఇసుకను అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్నారు. సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీ విధానం ప్రవేశపెట్టి ప్రజలకు, భవన నిర్మాణ కార్మికులకు చేదోడుగా నిలిచిన కూడా వైసీపీ నాయకులు ఏర్పాటు చేసుకున్న అక్రమ ఇసుక డంప్‌ల నుంచి ఒక ట్రాక్టర్ ఇసుకను రూ.3వేలుకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక పోలీసులకు తెలిసినా కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. సజ్జలగుడ్డం రోడ్డులోని జగనన్న కాలనీకి సంబందించి 1700 టన్నులు గల సుమారు 180 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను స్థానిక వైసీపీ నాయకులు సొంత ట్రాక్టర్ల ద్వారా తమకు అనుకూలమైన చోట ఓ ఇద్దరు కానిస్టేబుళ్ల సహకారంతో నిల్వ చేసుకున్నారని అందరికీ తెలిసిపోయింది. స్వయాన హౌసింగ్ డీఈ శేఖర్ కూడా ఆ ఇద్దరు కానిస్టేబుళ్లపై కూడా ఎస్ఐ సతీష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అయినా ఎస్ఐ కేసు నమోదు చేసినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆయన పాత్ర ఉన్నదనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఎస్పీలు వైసీపీ నాయకుల అక్రమ ఇసుక డంప్‌పై చర్యలు తీసుకొని, కేసులు నమోదు చేసి జరిమానా విధించాలని ప్రజలు కోరుతున్నారు.

పత్తికొండ ప్రజల రుణం తీర్చుకుంటాం

- మాజీ డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తి



మాట్లాడుతున్న కేఈ క్రిష్ణమూర్తి

పత్తికొండ,జూలై 13: అభివృద్ధి ద్వారానే పత్తికొండ ప్రజల రుణం తీర్చుకుంటామని మాజీ డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తి అన్నారు. పత్తికొండలో ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కేఈ శ్యాంబాబును గెలిపించిన పత్తికొండ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలుపుకుంటామని, నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కేఈ శ్యాంబాబు ముందుకుసాగుతారని అన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని, ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని అన్నారు. చంద్రబాబు, లోకేష్‌ల నాయకత్వంపై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. వెల్దుర్తి మండలానికి చెందిన టీడీపీ నాయకుడు సుబ్బరాయుడుకు ప్రాణహాని ఉన్నందు వల్ల ప్రభుత్వం ఆయనకు గన్‌మెన్‌ను కేటాయించడం హర్షణీయమన్నారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, మనోహర్ చౌదరి, బత్తిన లోక్‌నాథ్, కడవల సుధాకర్, వాకిటి శ్రీనివాసులు, నాగేష్ తదితరులు ఉన్నారు.

పోతుదొడ్డిలో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ

ఏడుగురికి గాయాలు



చికిత్స పొదుతున్న టీడీపీ నాయకుడు నారాయణ

ప్యాపిలి, జూలై 13: మండలంలోని పోతుదొడ్డి గ్రామంలో శనివారం వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన ఏడుగురికి గాయాలయ్యాయి. బాధితులను డోన్, కర్నూలు ఆస్పత్రులకు తరలించారు. పోతుదొడ్డి సమీపంలోని పొలాల్లో మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సమీప బంధువులు కంకర క్రషర్ పరిశ్రమను నిర్వహిస్తున్నారు. ఈ పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్యం వలన పంటలు దెబ్బతింటున్నాయని రైతుల ఆరోపణలు ఉన్నాయి. దీంతో టీడీపీకి చెందిన మాజీ సర్పంచు నారాయణ రైతులతో కలసి పది రోజుల క్రితం క్రషర్ మిషన్ దగ్గరకు వెళ్లి పరిశ్రమ వలన పంటలు దెబ్బతింటున్నాయంటూ పనులను నిలిపి చేశారు. అయితే రెండు రోజులుగా రాత్రిపూట మిషన్ ఆడిస్తూ నిర్వాహకులు వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న నారాయణ శుక్రవారం మరోసారి క్రషర్ మిషన్ దగ్గరకు పనులను బంద్ చేయించారు. దీంతో వైసీపీ నాయకులు క్రిష్ణమూర్తి శనివారం తన అనుచరులతో కలసి నారాయణ ఇంటి దగ్గరకు బయలు దేరారు. అయితే మార్గమధ్యలో కట్టపై కూర్చున్న నారాయణను వైసీపీ వర్గీయులు కంకర క్రషర్‌ను ఎలా బంద్ చేయిస్తావంటూ దుర్భాషలాడుతూ ఆయనపై దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న నారాయణ వర్గీయులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో ఇరువర్గాల వారు రాళ్లు, పట్టుడు కట్టెలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో వైసీపీకి చెందిన క్రిష్ణమూర్తి, రంగడు, శేషు, ఆదినారాయణలకు టీడీపీకి చెందిన నారాయణ, శ్రీనివాసులు, నడిపి ఓబులేసులకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం డోన్, కర్నూలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో వైసీపీ, టీడీపీ వార్గాలవారు ప్యాపిలి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ సుధాకర్ రెడ్డి పోతుదొడ్డిలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, జూలై 13: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. రెండవ శని, ఆదివారం సెలవు దినం కావటంతో వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖ ద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్స్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. భక్తులు రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని పండితుల ఆశీస్సులు పొందారు. భక్తుల రద్దీ పెరగడంతో లాడ్జిలు, హోటళ్లు, పూజా సామగ్రికి డిమాండ్ పెరిగింది.



మంత్రాలయం మంఠం ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు

సమస్యలపై ప్రశ్నిస్తారా..?

- పారిశుధ్యం మెరుగుపడేనా?
- రేపు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం
- హాజరుకానున్న మంత్రి టీజీ భరత్, ఎంపీ ఎమ్మెల్యేలు

కర్నూలు(న్యూసిటీ), జూలై 13: నగర పాలక సంస్థ సర్వసభ్యసమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు జరగనుంది. ఈ సమావేశంలో ప్రజా సమస్యలు చర్చనీయాంశాలవుతాయా? నగరంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై నిర్దిష్ట చర్చ జరిగి నిర్మాణాత్మక ప్రయత్నాలు జరుగుతాయా? అనే సందేహాలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీసంగా కూడా పనులు జరగలేదు. వీటిపై అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్లు ప్రశ్నిస్తారా లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. నగర పాలక సంస్థ సర్వసభ్యసమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు సుంకేసుల రోడ్డులోని ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీ కౌన్సిల్ హాలులో జరగనుంది. మేయర్ బీవై. రామయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ. భరత్‌తో పాటు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు. పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, కమిషనర్ భార్గవతేజ హాజరుకానున్నారు. ఎన్నికల ముందు ఫిబ్రవరి 17న చివరి సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ కారణంగా మళ్లీ జరగలేదు. సమావేశంలో 11 అజెండాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇదిలా నగరంలో దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలపై సభ్యుల వాదనలు ఎలా ఉంటాయన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. తుంగభద్ర పుష్కరాల సమయంలో కొన్న రూ.4 కోట్లకు పైగా విలువైన హెచ్‌డీ పైపుల మాయం వ్యవహారంపై సమగ్ర విచారణకు కమిషనర్ ఏ. భార్గవతేజ అడిషనల్ కమిషనర్ పివి. రామలింగేశ్వర్ కన్వీనర్‌గా ఏడుగురు సభ్యులతో విచారణ కమిటీ నియమించారు. ఈ సమావేశంలోనైనా పుష్కరాల కథ ముగుస్తుందా లేదా అనే విషయంపై కార్పొరేటర్లు, అధికారులు చర్చించుకుంటున్నారు. ప్రధానంగా ఉన్న పారిశుధ్య సమస్యపై గతంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో నగరంలో పారిశుధ్యం మెరుగునకు తీసుకోవాల్సిన చర్యలపై సభ్యులు పలు తీర్మానాలు చేయాల్సిన అవసరం ఉందని నగరవాసులు పేర్కొంటున్నారు.



రోడ్డు ప్రమాదంలో
వృద్ధురాలి దుర్మరణం

కర్నూలు, జూలై 13: నగరంలో బళ్లారి చౌరస్తా సమీపంలో అంబికా మెటల్ స్టోర్స్ దుకాణం ఎదురుగా శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమేశ్వరమ్మ (62) అనే వృద్ధురాలు దుర్మరణం చెందింది. ఈ ప్రమాదంలో ఆమె కూతురు ప్రశాంతి తీవ్రంగా గాయపడింది. ఎన్టీఆర్ బిల్డింగ్స్‌కు చెందిన వీరిద్దరు బళ్లారి చౌరస్తా సమీపంలో ఓ బంకును నిర్వహిస్తున్నారు. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత బంక్ మూసేసి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా.. పెద్దపాడు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి వీరిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సోమేశ్వరమ్మ అక్కడికక్కడే మృతి చెందగా.. ప్రశాంతికి తీవ్రగాయాలయ్యాయి. ప్రశాంతిని చికిత్స నిమ్మితం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీ.క్యాంపు రైతు బజారులో బయోగ్యాస్ ప్లాంటును ఏర్పాటు చేయండి

● మంత్రి టీజీ భరత్‌కు విజ్ఞప్తి


మంత్రి టీజీ భరత్‌కు వినతి పత్రం అందజేస్తునన మాజీ కార్పొరేటర్ సురేందర్

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 13: సీ. క్యాంపు రైతు బజారులో బయోగ్యాస్ ప్లాంటును ఏర్పాటు చేసి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని సీ.క్యాంపు మాజీ కార్పొరేటర్ సురేందర్ కోరారు. శనివారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సురేంద్ర మాట్లాడుతూ బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటుకు మంత్రి టీజీ భరత్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటు చేయడం ద్వారా ఏడాదికి రూ.4 లక్షలు డబ్బు ఆదా అవుతుందని ఆయన తెలిపారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 13: సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం రోజు తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలలో క్లాసులను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలను నడుపుతున్న ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అధిక ఫీజులను వసూలు చేస్తున్నారనీ ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు నరేంద్ర, రాజు, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్టా రాష్ట్ర కార్యదర్శిగా ప్రకాష్‌రావు ఎన్నిక


మాట్లాడుతున్న ప్రకాష్


కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 13: ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (ఆప్టా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కే.ప్రకాష్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం పోరంకిలోని చిగురుపాటి శ్రీకృష్ణవేణి పాఠశాలలో రాష్ట్ర కార్యవర్గం ఎన్నికైంది. రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడిగా ఏజీఎస్ గణపతిరావు, గౌరవాధ్యక్షులుగా మోహిద్ మీర్జా, ప్రధాన కార్యదర్శి కే.ప్రకాష్‌రావు, ఆర్థిక కార్యదర్శిగా ఎస్.నారాయణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్ రావు ఎన్నిక కావడం పట్ల జిల్లా ఆప్టా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సేవాలాల్ నాయక్, నంద్యాల జిల్లా ఆప్టా అధ్యక్షుడు అజీజ్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ రఫీ హర్షం వ్యక్తం చేశారు.

కేసీ కెనాల్‌ను శుభ్రం చేయండి: సీపీఎం


కేసీ కెనాల్ వద్ద చెత్తను చూపిస్తున్న సీపీఎం బృందం

కర్నూలు(న్యూసిటీ), జూలై 13: నగరంలో నడి బొడ్డున ప్రవహిస్తున్న కేసీ కెనాల్‌ను శుభ్రం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం బృందం కేసి కెనాల్ వినాయక ఘాట్ పరిసర ప్రాంతాలలో పర్యటించారు. సీపీఎం కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ కెనాల్లో మురుగునీరు చేరడంతో పాటు గుర్రపు డెక్క మొత్తం నిండిపోయి మురికినీరు సాఫీగా కిందకి ప్రవహించే పరిస్థితి లేదన్నారు. కేసీ కెనాల్‌లో మురికి నీరు నిలిచిపోవడం వల్ల దోమల విపరీతంగా పెరిగిపోయి మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ లాంటి ప్రాణాంతక వ్యాధుల బారిన ప్రజలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి కేసీ కాలువను శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామక్రిష్ణ, అబ్దుల్‌దేశాయ్, ఆర్.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


ర్యాలీ చేస్తున్న నాయకులు

గూడూరు, జూలై 13 : పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో 8ఏళ్ల బాలిక వాసంతిని హత్య చేసిన నిందితులను శిక్షించాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్, మాజీ ఛైర్మన్ రామాంజనేయులు, ఈడిగ భాస్కర్, వాల్మీకి శివ డిమాండ్ చేశారు. శనివారం గూడూరులో భారీ ర్యాలీ చేపట్టారు.


కలెక్టరేట్ ఎదుట కురుస్తున్న వర్షం



జడివాన

● అన్నదాతల్లో సంతోషం

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 13: జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో శనివారం జడివాన కురిసింది. మరో నాలుగు రోజుల పాటు ఈ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు స్పష్టం తెలిపారు. నగరంలో శనివారం మధ్యాహ్నం రెండు గంటల పాటు వర్షం కురిసింది.

రైతుల్లో హర్షం: సమయానికి వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం జూన్‌లో ముందస్తు వర్షాలు పడటంతో రైతులు పత్తి, మిరప, ఉల్లి, మిర్చి, కంది తదితర పంటలు సాగు చేశారు. అయితే.. జూలై నెల మొదలై 12 రోజులు గడిచిపోయినా వర్షం చినుకు పడకపోవడంతో పంటలు కళ్ల ముందే ఎండిపోవడం మొదలు పెట్టాయి. గత సంవత్సరం మాదిరి ఈసారి కూడా కరువు పరిస్థితులు చవి చూడాల్సి వస్తుందేమోనని రైతులు కన్నీళ్ల పర్యంతం అవుతున్నారు. అయితే.. శనివారం వాన కురవడంతో రైతుల్లో నెలకొన్న భయాందోళనలు మటుమాయమయ్యాయి. జిల్లాలో సాధారణ పంటల సాగు నాలుగున్నర లక్షల హెక్టార్లు కాగా, ఇప్పటికి 70వేల హెక్టార్లలో మాత్రమే ప్రధాన పంటలు సాగయ్యాయి.

రేపు బ్రాహ్మణ, హిందూ ధార్మిక సంస్థల ర్యాలీ


సంఘీభావం వ్యక్తం చేస్తున్న బ్రాహ్మణ సంఘాలు, హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు

కర్నూలు(కల్చరల్), జూలై 13: హిందువుల మధ్య విద్వేషం కలిగించేలా బ్రాహ్మణ కులస్థులను దూషిస్తూ, హిందూ దేవతలను కించపరుస్తూ సోషల్ మాధ్యమంలో ప్రచారం చేస్తున్న విజయనగరం జిల్లా పార్వతీపురం నివాసి పైలా దాస్, అలియాస్ జనార్దన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ నగరంలోని వివిధ బ్రాహ్మణ సంఘాలు, హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ టి. ప్రతాపరెడ్డి, బ్రాహ్మణ సంఘాల కో ఆర్డినేటర్ దేవళ్ల సాయినాథ శర్మ అన్నారు. శనివారం నగరంలో నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని దేవి ఫంక్షన్ హాలులో జరిగిన హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, కర్నూలు జిల్లా బ్రాహ్మణ సంఘాల ప్రతినిధుల సమావేశంలో వారు మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా సోషల్ మీడియాను వేదికగా చేసుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో వివిధ బ్రాహ్మణ సంఘాల నాయకులు కొలుకుల చంద్రశేఖర్, ఎన్ వెంకట రామరాజు, శ్యామసుందర్ శర్మ, కె. నరేష్, పవన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శ్రీకోన వెంకటేశ్వరస్వామి ఆలయం

సి. బెళగల్, జూలై 13: మండలంలోని క్రిష్ణదొడ్డి కొండపై వెలసిన శ్రీకోన వెంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటికిటలాడింది. స్వామివారిని దర్శించుకొవడానికి మండలంలోని చుట్టు పక్కల గ్రామాల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అలయ కమిటీ అన్నదాన కార్యక్రమం చేపట్టింది.

జీపీఎస్‌పై నోటిఫికేషన్ నిలిపేయాలి


యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 13: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించి జీపీఎస్ అమలుపై నోటిఫికేషన్‌ను నిలిపివేయాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్, యుటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ అన్నారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ ముందు గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. 2023 అక్టోబరు నుంచి సీపీఎస్ ఉద్యోగులందరినీ జీపీఎస్‌లోకి తెస్తూ రాజపత్రాన్ని ఇప్పుడు విడుదల చేయడం ఉద్యోగ ఉపాధ్యాయులను మోసగించడమేనన్నారు. ఈ కార్యక్రమంలో సహాధ్యక్షులు హేమంత్ కుమార్, యేహోషువ, జయరాజు, ఏటీ తిమ్మన్న, నరసింహ పాల్గొన్నారు.

నేడు పలు వార్డులలో రూ.1.70 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కర్నూలు(న్యూసిటీ), జూలై 13: నగర పాలక సంస్థకు సంబంధించి కర్నూలు నియోజకవర్గ పరిధిలోని పలు వార్డులలో రూ.1.70 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, మేయర్ బీవై రామయ్య, నగర పాలక కమిషనర్ ఏ.భార్గవ్‌తేజ హాజరై భూమి పూజ చేయనున్నారు. ఆదివారం సాయంత్రం 16వ వార్డు కిసాన్ ఘాట్, స్విమ్మింగ్ పూల్ నందు రూ.10లోలతో రోడ్డు వెడల్పు పనులు, అదే విధంగా 15వ వార్డు బుధవారపేట హిందూ శ్మశాన వాటికలో రూ.70 లక్షలతో మౌలిక సదుపాయాల కల్పన శంకుస్థాపన, 17వ వార్డు చాణిక్యపురి కాలనీలో రూ.70 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన, 23వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో రూ.20 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాలు ఉంటాయనీ నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు.

రక్షణ గోడ నిర్మించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 13: మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలకు రక్షణ గోడ నిర్మించాలని ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు అబూబాకర్ తెలిపారు. శనివారం నగరంలో ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను భా రత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించా రు. ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో దాదాపు 300 మంది పైగా విద్యార్థులు చదువుతున్నారని, రక్షణ గోడ లేకపోవడంతో విద్యార్థు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర సహా య కార్యదర్శి మల్లేష్, ఆర్యన్ నగర కమిటీ సభ్యులు ఎల్లక్రిష్ణ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి

కర్నూలు(హాస్పిటల్), జూలై 13: వైసీపీ నాయకుల చేతిలో గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి క్యాజువాల్టీలో చికిత్స పొందుతున్న ప్యాపిలి మండలం పోతుదొడ్డి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి వైద్యులను ఆదేశించారు. రోగి కోలుకునేలా అన్ని పరీక్షలు నిర్వహించి చికిత్సలు చేయాలన్నారు.

స్విమ్మింగ్ పూల్ అభివృద్ధికి కృషి చేస్తా

● మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్
● 9వ సబ్ జూనియర్ అంతర్ జిల్లా ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించి టీజీ


జెండా ఊపి స్విమ్మింగ్ పోటీలను ప్రారంభిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 13: కర్నూలు నగరంలో ప్రస్తుతం ఉన్న స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్ పూల్ అభివృద్ధితో పాటు మరో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటుకు అవసరమైన ఏర్పాట్లుకు కృషి చేస్తానని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్ పూల్‌లో ఏర్పాటు చేసిన 9వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధిఅధికారి భూపతిరావు, స్విమ్మింగ్ పూల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన ప్రతి అభివృద్ధిలో తన భాగస్వామ్యం ప్రత్యక్షంగా పరోక్షంగా ఉందన్నారు.

ఎన్టీఆర్ పురస్కార గ్రహీతలకు సత్కారం


ఎన్టీఆర్ పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న రంగస్థల కళాకారులు

కర్నూలు(కల్చరల్), జూలై 13: ఇటీవల ఎన్టీఆర్ పురస్కారాలు అందుకున్న పెనికలపాటి హనుమంతరావు చౌదరి, బైలుప్పల షఫీయుల్లా, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు అవార్డు గ్రహీత కేఎన్ అరుణకుమారిలను రంగస్థల కళాకారులు ఘనంగా సత్కరించారు. శనివారం నగరంలోని మద్దూర్‌నగర్‌లోగల పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో, జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుర్రపుశాల అంకయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సామాజిక సేవకుడు డాక్టర్ జీఎస్ఎం సుభాన్, బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు హాజరై కళాకారులకు శాలువలు కప్పి, పుష్పమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాటక దర్శకులు వీవీ రమణారెడ్డి, మనోహర్‌బాబు, సీనియర్ రంగస్థల నటులు హెచ్ చంద్రన్న, పి. దస్తగిరి, గాండ్ల లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

మొహర్రంను ప్రశాంతంగా జరుపుకోవాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ

గూడూరు, జూలై 13 : మొహరం పండుగను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ హనుమంతయ్య సూచించారు. శనివారం గూడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని మునగాల, మల్లాపురం, ఆర్.కానాపురం, గుడిపాడు గ్రామాల్లో ఎస్ఐ హనుమంతయ్య పర్యటించి మొహరం పండుగ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేశారు. బాణా సంచా, అగ్ని దివిటీలను భక్తులు దూరంగా పెట్టుకోవాలని సూచించారు.

బదిలీల్లో ఖాళీలను బ్లాక్ చేయరాదు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 13: ఉపాధ్యాయ బదిలీల్లో ఖాళీలను బ్లాక్ చేయరాదని పీఆర్‌టీయూ నాయకులు వి.కరుణానిధిమూర్తి, జిల్లా అధ్యక్షుడు ఎన్వీ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2003 ఉపాధ్యాయులకు ఓపీఎస్ కేంద్ర మెమో ప్రకారం అమలు చేయాలని, బదిలీల్లో ఖాళీలు బ్లాక్ చేయకుండా చూడాలని అన్నారు.

యశోద ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్), జూలై 13: నగరంలోని కొత్తబస్టాండు సమీపంలో ఉన్న యశోద నర్సింగ్ హోమ్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని సీఆర్ భవన్‌లో వారు మాట్లాడుతూ గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు బాబయ్య, నాయకులు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీని పట్టించుకోని అధికారులు

సి. బెళగల్, జూలై 13: పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అందించే సబ్సిడీ బియ్యం, బేడలు, చెక్కెర పంపిణీ ఇష్టారాజ్యంగా సాగుతున్నా మండల స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని శనివారం తిమ్మనదొడ్డి గ్రామస్తులు తెలిపారు. గ్రామాలలో బియ్యం కార్డుదారులు ఎందుకు డబ్బాలను పెట్టి తుకాలు వేస్తున్నారని ప్రశ్నిస్తే మీకు ఇష్టం వచ్చినోళ్ళకు చెప్పుకోండని బెదిరిస్తున్నారు. మండలంలోని తిమ్మనదొడ్డి, బురాన్‌దొడ్డి గ్రామాలలో సకాలంలో బియ్యం పంపిణీ చేయడం లేదు ఉన్నతాధికారులు చొరవ తీసుకుని కార్డుదారులకు నిత్యవసర సరుకులన్నీ సక్రమంగా అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రధానోపాధ్యాయులకు అర్జిత సెలవులు మంజూరు చేయాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 13: ఏప్రిల్ సెలవుల్లో పదో తరగతి ఫెయిలైన విద్యార్థుల సప్లిమెంటరీ పరీక్షల ఫీజుల చెల్లించుట, నాడు-నేడు పనుల విధులకు హాజరైన హై స్కూల్ ప్రధానోపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తారి వీర బ్రహ్మ శనివారం తెలిపారు. పాఠశాలలకు గత రెండు సంవత్సరాలుగా నిర్వహణ గ్రాంట్ విడుదల చేయడం లేదని, సొంత డబ్బు ఖర్చు పెడుతున్నట్లు తెలిపారు. నిధులు మంజూరు చేయాలన్నారు. జీవో.నెం.117ను రద్దు చేసి ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలో కొనసాగించాలన్నారు.

సీఎం చంద్రబాబుని కలిసిన నాయకులు

కర్నూలు(న్యూసిటీ), జూలై 13: గ్రామ పంచాయితీలకు నిధులు విడుదల చేయడంపై ఏపీ పంచాయితీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవి.బి.రాజేంద్రప్రసాద్,ప్రధాన కార్యదర్శి బిర్రుప్రతాప్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలిసి హర్షం వ్యక్తం చేశారు. శనివారం అమరావతిలో రాష్ట్ర కమిటి ప్రతినిధులతో కలిసి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కొత్తపు మునిరెడ్డి, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు చుక్కా ధనుంజయ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నగర పాలకలో ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు(న్యూసిటీ), జూలై 13: నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఏ.భార్గవతేజ శనివారం తెలిపారు. నగర పాలకకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే అర్జీ, ఆధార్,మొబైల్ నెంబర్లతో వచ్చి ఫిర్యాదు చేయవచ్చుని, తద్వారా సమస్యకు సత్వరమే పరిష్కారం పొందవచ్చని కమిషనర్ పేర్కొన్నారు.

రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ పదవిని కర్నూలుకు కేటాయించాలి


రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీడీ జనార్ధన్‌కు వినతి పత్రం ఇస్తున్న రజక సంఘం నాయకులు రాంబాబు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 13: రాష్ట్ర రజక కార్పొరేషన్ ఛైర్మన్ పోస్టును కర్నూలు జిల్లాకు కేటాయించి రాయలసీమ ప్రాంత రజకులకు న్యాయం చేయాలని రాయలసీమ ప్రాంత రజక సాధికార కమిటీ అధ్యక్షుడు రాంబాబు డిమాండ్ చేశారు. శనివారం విజయవాడలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీడీ జనార్దన్ నాయుడును కలిసి వినతి పత్రం ద్వారా కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రజకులందరూ టీడీపీ అభివృద్ధికి కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గిరి గణేష్, పాణ్యం నియోజకర్గం ఇన్‌చార్జి ఉల్లిందకొండ రమణ, వెకంటేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో 500 యురాలజీ ఆపరేషన్

● రాష్ట్రంలోనే మొదటిసారి అంటున్న వైద్యులు


500 లేజర్ యురాలజీ ఆపరేషన్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), జూలై 13: రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా 500 మందికి లేజర్ యురాలజీ శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించిన ఘనత కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌కు దక్కుతుందని హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు 500 లేజర్ యురాలజీ శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేసినందుకు మెడికవర్ హాస్పిటల్‌లో శనివారం యురాలజీ వైద్యనిపుణుడు డా.అబ్దుల్ సమద్, వైద్యులతో కలిసి క్లస్టర్ హెడ్ కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా యురాలజిస్టు డా. అబ్దుల్ సమద్ మాట్లాడుతూ 5 సంవత్సరాల క్రితం కిడ్నీలో రాళ్లకు శస్త్రచికిత్స చేయాలంటే కీహోల్ ద్వారా చేయాల్సి వచ్చేదని, కాని ఇప్పుడు అత్యాధునిక టెక్నాలజీలో హోల్మియం లేజర్ ద్వారా కిడ్నీలో రాళ్లను కోత, కుట్టు లేకుండా తొలగించడానికి వీలవుతుందన్నారు.

కర్నూలులో కిమ్స్ కడల్స్ సేవలు

● ప్రారంభించిన కిమ్స్ సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు

కర్నూలు(హాస్పిటల్), జూలై 13: హైదరాబాదు, చెన్నై లాంటి పెద్ద నగరాలకు మాత్రమే పరిమితమైన కిమ్స్ కడల్స్ ఆసుపత్రి సేవలు ఇప్పుడు రాయలసీమ పరిధిలోని కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌లో ప్రారంభమయ్యాయి. శనివారం కిమ్స్ హాస్పిటల్‌లో కొత్తగా అభివృద్ధి చేసిన మాతా శిశు సూపర్ స్పెషాలిటీ సేవల విభాగమైన కిమ్స్ కడల్ ఆసుపత్రిని కిమ్స్‌గ్రూప్ సీఎండీ డా. బొల్లినేని భాస్కర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణలో ఇది సరికొత్త అధ్యాయమని, రాయలసీమ ప్రాంతానికి మాతా శిశువుల సంరక్షణ విషయంలో అత్యుత్తమ సేవలు అందించడానికి కిమ్స్ కడల్స్ ఆసుపత్రి కర్నూలుకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ హెడ్ కిశోర్ రెడ్డి, సీవోవో డా. సునీల్, కిమ్స్ హాస్పిటల్ వైద్యులు డా.జి.సుధాకర్, డా.రఫిక్ అహ్మద్, డా.గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రమణీయం వెండి గజ వాహనోత్సవం

మంత్రాలయం, జూలై 13: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు గజ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం ఆషాఢ శుద్ధ సప్తమిని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంగారు, వెండి, పట్టువస్త్రాలు, గులాబి పుష్పాలతో బృందావనాన్ని శోభాయమానంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజ వాహనంపై బంగారు అంబారీలో వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక ట్రాన్స్‌పోర్టు సెక్రటరీ

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు సెక్రటరీ మంజునాథ్ శనివారం మంత్రాలయం వచ్చారు. ఈయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకున్నారు. రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు.

జీవో 84ను రద్దు చేయాలి

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 13: మున్సిపల్ పాఠశాలలను విలీనం చేసే జీవో 84ను రద్దు చేయాలని ఏపీ రాష్ట్ర మున్సిపల్ పీడీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుధీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ హై స్కూల్‌లో జరిగిన మున్సిపల్ పీడీ పదోన్నతుల డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జీవో.నెం.84ను కోర్టులు కూడా వ్యతిరేకిస్తున్నాయని, వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ సందర్భంగా హాకీ పోటీలను నిర్వహించారు. మున్సిపల్ పీఈటీలకు, పీడీలుగా పదోన్నతులు ఆరు సంవత్సరాలైన సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ పీడీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఈఎస్సీ ట్రెజరర్ సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జయకర్ పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జానయ్య మాదిగ

ఆదోని (అగ్రికల్చర్), జూలై 13: మండలంలోని నాగనాథనహళ్లి గ్రామంలో దళిత మహిళ గుండమ్మపై ట్రాక్టర్ ఎక్కించి అతి కిరాతకంగా హత్య చేసిన నిందితులను అరెస్టు చేయాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య మాదిగ డిమాండ్ చేశారు. శనివారం నాగనాథనహళ్లి గ్రామంలో గుండమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం తగాదా విషయంలో గుండమ్మను హత్య చేసిన శ్రీధర్ రెడ్డి, రాఘవరెడ్డి, సోమశేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి, బోయ రామకృష్ణ, గోవిందు, ఈడిగ నాగరాజు, రాజా సాహెబ్‌లను వెంటనే అరెస్ట్ చేయాలని అన్నారు. మృతురాలు కుటుంబానికి ఉద్యోగం, రూ.50 లక్షల పరిహారం, ఐదు ఎకరాల పొలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మణికుమార్, మాదాసు రాజాబాబు, రాజేంద్ర ఉదయ్, బాలరాజు పాల్గొన్నారు.

ఆలూరు: ఆదోని మండలం నాగనాథనహళ్లిలో పొలం తగాదాలో దళిత మహిళను ట్రాక్టర్‌తో గుద్ది చంపిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రచార కార్యదర్శి ముత్యాల గాదిలింగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత మహిళను దారుణంగా హత్య చేయడం బాధాకరమన్నారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు బాలరాజు సుధాకర్, శేఖర్ గూళ్యం మల్లి, మహేష్ పాల్గొన్నారు.



ఆలూరులో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రచార కార్యదర్శి ముత్యాల గాదిలింగ

ఆస్పరి: ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామంలో పొలం తగాధాలో దళితను ట్రాక్టర్‌తో గుద్ది చంపిన వారిని కఠినంగా శిక్షించాలని మాల మహానీయుడు జిల్లా అధ్యక్షుడు మహానంది అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ దళిత మహిళ గుండమ్మను అధికార పార్టీ అండతో హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండమ్మను ట్రాక్టర్‌తో తొక్కించి చంపడం హేయమైన చర్య అని అన్నారు. హత్య చేసిన రాఘవేంద్ర రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మరియు అతని అనుచరులపై కఠిన చర్యలు తీసుకొని గుండమ్మ కుటుంబానికి రూ.50 లక్షలు, ఐదు ఎకరాల భూమి, వారి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ సంఘటనపై జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీరేష్, రంగస్వామి, హరికృష్ణ, బంగారు పాల్గొన్నారు.

నాగనాథనహళ్లిలో పోలీసుల పహారా

ఆదోని రూరల్, జూలై 13 : మండల పరిధిలోని నాగనాథనహళ్లి గ్రామంలో రెండు రోజులుగా రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐలు శ్రీనివాసులు, పీరయ్య, ఎర్రిస్వామితోపాటు పలు మండలాల పోలీస్ సిబ్బంది పహారా చేపట్టారు. భూ తగాదాలో గుండమ్మకు మద్దతుగా వచ్చిన పురుషోత్తంరెడ్డి తీవ్ర గాయాలతో కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో సమగ్ర సమాచారం కోసం పోలీసులు శనివారం కర్నూలుకు వెళ్లారు. కాగా ఇప్పటికే గుండమ్మ హత్య కేసులో ప్రదాన నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. నేడో రేపో నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టనున్నట్టు తెలిసింది.



నాగనాథనహళ్లి గ్రామంలో పహారా కాస్తున్న పోలీసులు

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలి



పల్లా శ్రీనివాసులును కలిసిన ఆలూరు టీడీపీ నాయకులు

ఆలూరు/చిప్పగిరి, జూలై 13: నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి ఆలూరు టీడీపీ నాయకులు కోరారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఆలూరు నియోజక వర్గ మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జీ, మాజీ జడ్పీటీసీలు కలిసి కోరినట్లు మాజీ జడ్పీటీసీ మీనాక్షినాయుడులు శనివారం రాష్ట్ర అధ్యక్షుడిని కలిశారు. పార్టీకి నిస్వార్థ సేవలందించిన నాయకులను గుర్తించాలని కోరారు. వెనుక బడిన ఆలూరు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న వేదవతి, నగరడోణ ప్రాజెక్టులు పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన వారిలో మండల కన్వీనర్లు అశోక్, వల్లి, సుధాకర్, తిప్పయ్య, విజయభాస్కర్, టీడీపీ నాయకులు శేషగిరి, రజినీ, వెంకటేష్ చౌదరి, మారుతి, లక్ష్మణ, నరసింహులు, ముత్యాల రెడ్డి, లక్ష్మణ, ప్రవీణ్, పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మునెప్ప

పత్తికొండ టౌన్, జూలై 13: ప్రభుత్వ వైద్య రంగంలో పని చేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు మునెప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో కమ్యూనిటీ యూనిట్ సెంటర్ వైద్య కార్మికుల యూనియన్ సమావేశం ఆనంద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ శానిటేషన్ కార్మికులకు జీవో.నెం.549 ప్రకారం ప్రతి కార్మికునికి నెలకు రూ.16 వేల వేతనం, సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం రూ.11 వేలు ఇవ్వాలని అన్నారు. ఆబ్కాస్‌లో పని చేస్తున్న వారిని రెగ్యులర్ ఉద్యోగులుగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ముస్తాన్, రంగన్న, నెట్టికంటయ్య, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కార్మికులు దేవయ్య, ఆనంద్ కుమార్, భూషయ్య, నారాయణ స్వామి, రాజేశ్వరి, చంద్రకళ పాల్గొన్నారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు



మారెమ్మ దేవాలయం ముఖద్వారానికి నీళ్లు పోస్తున్న గ్రామస్థులు

గోనెగండ్ల, జూలై 13: సకాలంలో వర్షాలు లేక పంటలు ఎండిపోతుండటంతో గోనెగండ్లలో ప్రజలు, రైతులు, యువకులు గ్రామంలోని చింతలాముని, నల్లారెడ్డి, మారమ్మ, సుంకులమ్మ, ఆంజనేయ స్వామి, ఈశ్వర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం గ్రామంలోని బావులు నుంచి బిందెలతో నీటిని తీసుకువచ్చి దేవాలయాల ముఖ ద్వారాలకు పోసి పూజలు చేశారు. సుంకులమ్మ, మారెమ్మ దేవతలకు నైవేద్యం, పూలు, టెంకాయల సమర్పించారు. ఈ పూజలు మరో నాలుగు రోజులు చేస్తున్నట్లు గ్రామ ప్రజలు, రైతులు తెలిపారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి

తుగ్గలి, జూలై 13: తుగ్గలి మండల అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తిమ్మయ్య చౌదరి, మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు అన్నారు. శనివారం పత్తికొండలో మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తిని కలిసి సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వల్లె వెంకటేశ్వర్లు, షైరాముడు, కృష్ణ, రాంపురం మల్లయ్య పాల్గొన్నారు.

చిన్నారి వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న టీడీపీ నాయకుడు సూర్య నారాయణ

ఆదోని, జూలై 13: మండలంలోని ఇస్వీ గ్రామంలోని ఇస్వి గ్రామ అంగన్వాడీ కేంద్రం వద్ద చిన్నారి హుస్సేని విద్యుత్ తీగలు తగిలి తీవ్ర గాయాలతో కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ బాలుడి వైద్య ఖర్చుల కోసం తెదేపా సీనియర్ నాయకులు సూర్యనారాయణ, మారుతి రూ.25వేలు అందజేశారు. శనివారం కర్నూలు సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు హుసేనిని కలిసి పరామర్శించారు. విద్యుత్ తీగల వల్ల శరీరం తీవ్రంగా కాలిపోవడంతో ఆపరేషన్ అవసరమని వైద్యులు సూచించినట్లు తల్లిదండ్రులు వారి దృష్టికి తీసుకువచ్చారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాలు మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం చేశారు. వారి వెంట ఆ గ్రామానికి చెందిన నరహరి రెడ్డి ఉన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందు

ఎమ్మిగనూరు, జూలై 13: కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోవిందు అన్నారు. శనివారం పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో సీపీఎం ఎమ్మిగనూరు డివిజన్ రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. నాయకులు హనుమంతు, గురుశేఖర్, రాముడులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం సరళీకరణ విధానాలను వేగంగా అమలు చేయటం ఆపటం లేదని విమర్శించారు. ప్రజలు అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనరసయ్య, అబుల్లా, సురేష్, కృష్ణ, నరసింహులు, తిమ్మన్న, ఇస్మాయిల్, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని పరిరక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర సహఅధ్యక్షుడు సురేష్ కుమార్

ఎమ్మిగనూరు, జూలై 13: గత ప్రభుత్వం చిన్నాభిన్నం చేసిన ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని యూటీఎఫ్ రాష్ట్ర సహఅధ్యక్షులు సురేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని వీవర్స్ కాలనీలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు భాస్కర్, బెల్లాజర్, లవకుమార్‌లను సన్మానించా రు. నాగమణి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ కుమార్, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటిలు మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ విద్యారంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. వైసీపీ ప్రభుత్వం అవలంబించిన విధానల వల్ల విద్యారంగం సంక్షోభంలో పడిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతో సహకారం అందించారని తెలిపారు. 117 జీవోను రద్దు చేసి ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దావీదు, ఎల్లప్ప, నరసింహులు, దేవపాల్, కౌలన్న, రామాంజనేయులు, రాజు, ప్రకాష్, అల్లాబకాష్, లతీఫ్, చంద్రపాల్‌లు పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు

మద్దికెర, జూలై 13: మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం, బురుజుల తదితర గ్రామాల్లో మొహరం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లోని పీర్ల చావిడిలలో పీర్లు కొలువుదీరాయి. ఈ నెల 14వ తేదీ ఆదివారం చిన్న సరిగెత్తు, 16న పెద్ద సరిగెత్తు, 17న పీర్లు ఏటికి వెళ్తాయని పీర్ల ముజావర్లు తెలిపారు. వేడుకలను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు ముస్తాబు చేశామని తెలిపారు.

శాంతియుతంగా మొహరం జరుపుకోండి

మొహరం వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలని మద్దికెర ఎస్ఐ రమేష్‌బాబు అన్నారు. శనివారం గ్రామ పెద్దలతో సమావేశమ య్యారు. గ్రామపెద్దలు ముందస్తుగానే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అనుమతులు పొందాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

● **తుగ్గలి:** పీర్ల దేవుళ్ల కొలువుదీరారు. శనివారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరి, మామిళ్లకుంట, రాతన తదితర గ్రామాల్లోని చావిడిలలో పీర్లను ముజావర్లు కొలువుదీర్చారు. దీంతో భక్తులు పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదో రోజు చిన్న సరిగెత్తు, 9వ రోజు పెద్ద సరిగెత్తు ఉంటుంది.

ఆలయానికి రూ.లక్ష విరాళం

మద్దికెర, జూలై 13: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో నిర్మాణం చేపట్టిన శ్రీకృష్ణుని దేవాలయానికి పెరవలి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ జడ్పీటీసీ సభ్యులు పి.పురుషోత్తం చౌదరి రూ.లక్ష విరాళం అందించారు. శనివారం ఆలయ పెద్దలకు విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ సంఘం నాయకులు జలదరాశి రామాంజనేయులు, శంకర్, రమేష్, మాజీ దేవాలయ చైర్మన్ బారిక ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్ ఐ.రాముడు ఉన్నారు.

క్రమశిక్షణ కలిగిన విద్య అవసరం

మద్దికెర, జూలై 13: క్రమ శిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమని ఎంఈవో-2 గోపాల్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీపీ స్కూల్‌లో యూఎస్ఏకి చెందిన డా.గోరంట్ల వాసుబాబు రూ.30వేల విలువ చేసే బోధన పరికరాల పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం డి.ఆంజనేయులు, హుసేనప్ప, రంగన్న, రామాంజులు, మధుబాబు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

ఏబీవీపీ నూతన కమిటీ ఎన్నిక

ఆదోని (అగ్రికల్చర్), జూలై 13: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆదోని నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరమణ సంయుక్త కార్యదర్శి ఎర్రిస్వామి ఆధ్వర్యంలో నగర కార్యదర్శిగా వీరేష్, సహాయ కార్యదర్శులుగా ఉమామహేష్, గోవిందరాజులు, ముఖేష్, సంతోష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విద్యారంగ సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించే విధంగా నిరంతరం కృషి చేయాలని సూచించారు.

కర్ణాటక మద్యం ధ్వంసం

కోసిగి, జూలై 13: కోసిగి సెబ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని ధ్వంసం చేస్తున్నట్లు సెబ్ సీఐ మహబూబ్ బాషా తెలిపారు. శనివారం కోసిగిలోని మార్కెట్ యార్డులో సుమారు 452 లీటర్ల కర్ణాటక మద్యంతో పాటు ఆంధ్రకు చెందిన మూడు లీటర్ల మద్యం బాటిళ్లను ధ్వంసం చేశామని చెప్పారు.

పని చేసిన వారికి గుర్తింపు



టీడీపీ స్టిక్కర్లను విడుదల చేస్తున్న దృశ్యం

ఆలూరు, జూలై 13: పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్ అన్నారు. శనివారం టీడీపీ స్టిక్కర్లను ఆయన విడుదల చేశారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడే వారి సేవలను అధిష్టానం గుర్తించి నామినేటెడ్ పోస్టులు ఇస్తోందన్నారు.. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అమలు అయ్యేలా ప్రతి కార్యకర్త చూడాలన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు గిరిమల్లేష్ గౌడ్, నెట్టప్ప, హనుమప్ప స్వామి, రాము యాదవ్, రమేష్ పాల్గొన్నారు.

పందికోనలో డోన్ ఎమ్మెల్యే కోట్ల

పత్తికొండ, జూలై 13: పందికోన గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రంగపురాజు ఇంటిని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి శనివారం సందర్శించారు. రంగపురాజు కుమారుడి వివాహం కొద్ది రోజుల క్రితం జరిగింది. వివాహ వేడుకలకు హాజరు కాలేకపోవడంతో గ్రామానికి చేరుకుని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు నాయకులు ప్రమోద్ కుమార్ రెడ్డి, ఎద్దులదొడ్డి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

తప్పుడు ప్రచారం తగదు

మద్దికెర, జూలై 13: ప్రభుత్వంపై వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలని జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు శివప్రసాద్ యాదవ్ అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ తల్లికి వందనం పథకంపై ప్రభుత్వం ఇంత వరకు ఎలాంటి దిశా నిర్దేశాలు విడుదల చేయనప్పటికీ వైసీపీ నాయకులు సొంత పత్రికల్లో తప్పుడు కథనాలు వేయించడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ కృష్ణ, సుగ్గులప్ప, చెన్నంపల్లి మల్లికార్జున, చాకలి రంగన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్స్ కమిటీ ఎన్నిక

వెల్దుర్తి, జూలై, 13: పట్టణంలో ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ వెల్దుర్తి ప్రాజెక్టు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిలను కలిసి సమస్యలను వివరించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చాందిని, జిల్లా ఉపాధ్యక్షురాలు ఈదమ్మ, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు మాధవస్వామి పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 13: డప్పు కళాకారుడు లక్ష్మణపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిక్కప్ప డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మణను పరామర్శించి దాడి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోని పట్టణంలోని ప్రశాంత్ నగర్‌లో మొహరం వేడుకలలో డప్పు కొడుతున్న లక్ష్మణపై బోయ శేఖర్, బుడ్డా కృష్ణ కులం పేరుతో దూషిస్తూ కట్టెలతో దాడి చేయడం బాధాకరమన్నారు. వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగేంద్ర, మునిస్వామి, కృష్ణమూర్తి, పరమేష్, గోపాల్, లింగన్న, తిప్పన వెంకటేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని (అగ్రికల్చర్), జూలై 13: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనదని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. శనివారం ఎస్టీయూ ఆధ్వర్యంలో ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు రామయ్య, శ్రీనివాసుల సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నాగేంద్రప్ప, వెంకటేశ్వర్లు, నాగరాజు, రామ్మో హన్ రెడ్డి, రమేష్ నాయుడు, వీరచంద్ర యాదవ్ పాల్గొన్నారు.

రమణీయం వెండి గజ వాహనోత్సవం



మంత్రాలయంలో కర్ణాటక రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు సెక్రటరీ

మంత్రాలయం, జూలై 13: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు గజ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం ఆషాఢ శుద్ధ సప్తమిని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంగారు, వెండి, పట్టువస్త్రాలు, గులాబీ పుష్పాలతో బృందావనాన్ని శోభాయమానంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజ వాహనంపై బంగారు అంబారీలో వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక ట్రాన్స్‌పోర్టు సెక్రటరీ

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు సెక్రటరీ మంజునాథ్ శనివారం మంత్రాలయం వచ్చారు. ఈయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకున్నారు. రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు.

దేశ హితం కోసం పని చేయాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమణ

ఆదోని రూరల్, జూలై 13: ప్రతి విద్యార్థి దేశ హితం కోసం పని చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటరమణ అన్నారు. ఏబీవీపీ ఆదోని శాఖ ఆధ్వర్యంలో నగర నూతన కమిటీ కార్యదర్శిగా వీరేష్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ దేశభక్తి కలిగిన విద్యార్థులను తయారు చేయడమే ఏబీవీపీ ముఖ్య ఉద్దేశమని, ప్రతి విద్యార్థి నిరంతరం ఒక సిపాయిగా దేశ కోసం పని చేయలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఉమా మహేష్, గోవిం దరాజులు, ముఖేష్, సంతోష్‌లు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు



ఎమ్మెల్యేల బీవీ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు

ఎమ్మిగనూరు, జూలై 13: ఎమ్మిగనూరులో వైసీపీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు నలుగురు, ఓ వార్డు కౌన్సిలర్ కుమారుడు వైసీపీని వీడి శనివారం ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీకి చెందిన ఐదో వార్డు కౌన్సిలర్లు అమాన్, ఏడో వార్డు కౌన్సిలరు ఎరుకల సుంకమ్మ కుమారుడు సూర్యనారాయణ, 16వ వార్డు కౌన్సిలరు ఇసాక్, 23వ వార్డు కౌన్సిలర్ చంద్రమోహన్ రెడ్డి, 29వ వార్డు కౌన్సిలర్ రజిత (ప్రతాపరెడ్డి భార్య), మరి కొంతమంది వైసీపీ వార్డుల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఇంటి దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మిగనూరు అభివృద్ధి కోసమే చేరికలు అని అన్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, మిఠాయి నరసింహులు, మహేంద్ర బాబు, ముల్లా కలీముల్లా, రంగస్వామి గౌడ్, జహంగీర్, ఎరుకల శీను, కటారి రాజేంద్ర, వడ్డె కృష్ణ, దామ నరసింహులు, దేవేంద్ర, శిల్పి భాస్కర్, ఉప్పర రవి పాల్గొన్నారు.

ప్రణయ హంపి పుస్తకావిష్కరణ

ఎమ్మిగనూరు, జూలై 13: ప్రముఖ రచయిత మారుతి రచించిన ప్రణయ హంపి పుస్తక పరిచయ సభను పట్టణంలోని కుర్ని కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు హాజరైన రాయలసీమ అస్తిత్వ ఉద్యమ నేత భూమన్, ఎన్ నాగమణి, అరుణాంక్ లత, ముక్కామల లత, విరసం నాయకుడు పాణి, అనంతు, ఇనాయతుల్లాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆహ్వానితులు శ్రీనివాసులు, రాము, నాగన్న, బజారప్ప పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం